వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
బుధవారం, ఆగస్టు 12, 2026

# బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- **ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ**
- **రేపు సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఈ పథకాన్ని ఆగస్టు 13, గురువారం మధ్యాహ్నం 12:00 గంటలకు హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని జీ–29 హాల్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, వంద శాతం ప్రభుత్వ సబ్సిడీతో వీటిని అందజేయడం ఈ పథకం ప్రధాన ప్రత్యేకత. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా, ఇంటి వద్దనే ఉపాధి పొందుతూ ఆర్థిక వృద్ధి సాధించే భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యం. రేపు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పథకానికి సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, లబ్ధిదారుల ఎంపిక



ప్రక్రియ తదితర పూర్తి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొననున్నారు.

# 'పాంచజన్య' సభ వాయిదా

**మిలాద్ ఉల్ నబీ నేపథ్యంలో ఆగస్టు 31కి మార్పు**



**నిజామాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మిలాద్ ఉల్ నబీ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ నెల 26న నిర్వహ తలపెట్టిన 'పాంచజన్య' సభను ఆగస్టు 31కి వాయిదా వేసినట్లు తెలంగాణ రక్షణ సేన నిర్వాహకులు ప్రకటించారు. పండుగ వేళ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతోనే సభ తేదీని మార్చినట్లు వారు స్పష్టం చేశారు. ఈ సభను అత్యంత విజయవంతం చేసే లక్ష్యంతో నిజామాబాద్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. పాంచజన్య సభ ఇన్‌చార్జ్ డాక్టర్ రఘు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 31న జరిగే సభకు సంబంధించిన ఏర్పాట్లను ముమ్మరం చేయడంపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రజలను పెద్ద సంఖ్యలో సభకు తరలించేందుకు తగిన కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ రఘు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు అజార్ భాయ్ తో పాటు తెలంగాణ రక్షణ సేన ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ విజయానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్రహీనులవుతారు

**మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేవలం మతం పేరుతోనే బీజేపీ నేతలు రాజకీయ ప్రగల్భాలు పలుకుతున్నారే తప్ప, వారి ద్వారా ఎలాంటి అభివృద్ధి సాధ్యం కాదని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మండిపడ్డారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై బీజేపీ నాయకులు చేస్తున్న నిరాధార విమర్శలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం ఎమ్మెల్యే నివాసంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు, కౌన్సిలర్ తుమ్మ మధుతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజన్న ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున, ముఖ్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇప్పటివరకు ఎన్ని నిధులు తెచ్చారో ఆధారాలతో సహా బహిరంగంగా చెప్పాలని పుల్కం రాజు సవాల్ విసిరారు. దేవుడి పేరుతో, మతం పేరుతో వందలాది కోట్లు దండుకున్నది బీజేపీ నేతలేనని ఆరోపించారు. గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో గడిచిన మూడేళ్లలో జరుగుతోందని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ.400 కోట్లతో ఆలయ సమగ్ర అభివృద్ధి, రహదారుల విస్తరణ, మౌలిక వసతుల కల్పన పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. హిందూ మతాన్ని అడ్డుపెట్టుకుని లబ్ధి పొందుతున్న బీజేపీ నాయకులు తమ స్థాయిని మరచి మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి పట్టణ అభివృద్ధికి సహకరించాలని, లేదంటే ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ మీడియా సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, జిల్లా నాయకులు చిలక రమేష్, కూరగాయల కొమురయ్య, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనంతోనే మేధో వికాసం, సంపూర్ణ విజ్ఞానం సాధ్యమని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. భారతీయ గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి (జాతీయ గ్రంథాలయ దినోత్సవం) సందర్భంగా వేములవాడ పట్టణంలోని అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా గ్రంథాలయ పుస్తకాల పఠనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారదతో పాటు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# 'విశ్వనాధ్ అండ్ సన్స్' ప్రీ రిలీజ్ వేడుక

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్**



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వంశీ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వనాధ్ అండ్ సన్స్' ప్రీ రిలీజ్ వేడుకను జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రముఖ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అగ్ర హీరో సూర్య, నటి మామిత బైజు ప్రధాన తారాగణంగా నటించారు. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ వేడుక సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులందరికీ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ఘన విజయం సాధించి, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు, పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# లైంగిక వేధింపులపై ఫిర్యాదుకు ఇంటర్నల్ కమిటీ

◆ **అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నగరంలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల రక్షణకు పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళా ఉద్యోగులపై కార్యాలయాల్లో జరిగే లైంగిక వేధింపుల నివారణకు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఇంటర్నల్ కమిటీల ఏర్పాటుతో పాటు ఈ–రిజిస్ట్రేషన్ డ్రైవ్‌ను విజయవంతంగా ప్రారంభించినట్లు హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, హైదరాబాద్ అలాగే 'యాక్షన్ ఎయిడ్ అసోసియేషన్' సంయుక్త ఆధ్వర్యంలో ఈ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. మహిళలకు కార్యాలయాల్లో సురక్షితమైన, గౌరవప్రదమైన మరియు వేధింపులేని వాతావరణాన్ని కల్పించడమే ఈ చట్టం మరియు కమిటీల ప్రధాన లక్ష్యమని డా.పుట్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మహిళా ఉద్యోగుల భద్రతను, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంబంధిత నోడల్ ఆఫీసర్లకు, ఇంటర్నల్ కమిటీ సభ్యులకు ప్రత్యేక మార్గదర్శకాలు మరియు సాంకేతిక సహాయం అందించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 91 ఇంటర్నల్




కమిటీలను ఏర్పాటు చేసి, మహిళా అభివృద్ధి & శిశు సంక్షేమ శాఖ మరియు యాక్షన్ ఎయిడ్ అసోసియేషన్ సహకారంతో తెలంగాణ 'షీ–బాక్స్'పోర్టల్‌లో వాటిని సక్సెస్‌ఫుల్‌గా రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆయన వివరించారు. ఈ సమన్వయ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆరోగ్య రంగంలో మహిళలకు మరింత సురక్షితమైన, సమానత్వంతో కూడిన, అనుకూలమైన కార్యాలయ వాతావరణాన్ని అందించడంలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డా. అనిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. శ్రీకళ, యాక్షన్ ఎయిడ్ అసోసియేషన్ ప్రతినిధి వందన పౌల్ బర్దరూ, దీపిక, తదితర వైద్యాధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెంగళ మల్లేశంగౌడ్‌కు పరామర్శ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ వెంగళ అనిత – శ్రీకాంత్ గౌడ్ దంపతుల తండ్రి వెంగళ మల్లేశంగౌడ్ అనారోగ్యంతో గుండెకు సంబంధించిన చికిత్స నిమిత్తం చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో చేరారు. ఈ నేపథ్యంలో బుధవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆసుపత్రికి వెళ్లి మల్లేశంగౌడ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు.